# నాన్నగారిని పలకరిద్దాం!



" తల్లిలాంటి శిక్షణ
తండ్రిలాంటి రక్షణ"
ఆంధ్రప్రదేశ్‌లోని ఒక కార్పొరేట్ విద్యాసంస్థ నినాదం ఇది.
విద్యాసంస్థ ఎంచుకున్న ఆ నినాదం వెనుక కుటుంబ వ్యవస్థ స్వరూపం, ఆ వ్యవస్థలో పిల్లలకు లభించే ప్రయోజనం అంతర్లీనంగా ఉంది.
బిడ్డకు తల్లే తొలిగురువు అని, తండ్రి అతనికి రక్షణనిచ్చి వ్యక్తిగా తీర్చిదిద్దే స్నేహితుడని చెప్పుకుంటుటారు. నిజం కూడా ఇదే!
పిల్లలను ఎక్కువగా ప్రభావితం చేసేది తల్లిదండ్రులు, వారి వ్యక్తిత్వమే.
ఇలా తల్లిదండ్రులలో తల్లికి తొలినాటి నుంచీ ప్రాధాన్యం ఎక్కువే అయినా మారుతున్న కాలంలో కుటుంబంలో తండ్రి ప్రాముఖ్యం కూడా పెరిగింది. ఆధునిక కుటుంబంలో తల్లి విధులు, తండ్రి బాధ్యతలూ అంటూ విడివిడిగా ఏమీ లేవు. ఆ విధులు, బాధ్యతలు సరిసమానంగా పంచుకుంటున్నారు. తల్లి విధులు తండ్రి చేపడితే, తండ్రి బాధ్యతలు తల్లీ నిర్వహిస్తోంది.
తల్లిదండ్రులపై అభిమనం, ఆప్యాయతకల పిల్లలు దీనిని గుర్తించారు. మదర్స్ డేతో పాటు ఫాదర్స్ డేని కూడా పాటించడం ప్రారంభించడం మొదలుపెట్టారు. 1906 నుంచే విదేశాలలో ఫాదర్స్ డే పాటిస్తూ వస్తున్నా, ఇప్పుడిప్పుడే భారతదేశంలోనూ 'ఫాదర్స్ డే' తండ్రికి కానుకలు పంపడం వంటి సంప్రదాయాలు చోటుచేసుకుంటున్నాయి.
కనీసం ఇటువంటి రోజు అయినా సుదూరంగా ఉన్న తమ సంతానం తమను తప్పక పలకరిస్తుందని ఎదురుచూసే తల్లిదండ్రులు పెరుగుతున్నారు.
అసలు ఈ పితృదినోత్సవం పాటించడానికి దారితీసిన కారణాలేమిటి చూద్దాం!
తల్లి ప్రేమ విలువైనది. వెలలేనిది. మనల్ని కనిపెంచిన ఆమెకు ధన్యవాదాలు చెప్పడానికంటూ ప్రపంచవ్యాప్తంగా ఒకరోజంటూ ఏర్పాటు చేసుకోవాలన్న ఆలోచనతో మాతృదినోత్సవం పుట్టింది. మదర్స్ డే సాధించిన అద్భుత విజయం తర్వాత ఫాదర్స్ డే కూడా ఏర్పాటయ్యింది.
భార్య చనిపోతే పిల్లలకు తల్లీ, తండ్రీ అన్నీ తానే అయి పెంచిన తండ్రులను మనం చూసే ఉంటాం. అలాంటి కథలు వినే ఉంటాం. బహుశా అటువంటి కథే ఫాదర్స్ డేకీ ఉండడం విచిత్రమేమీ కాదు.
ఒకరి ఎదుగుదల వెనకాల తల్లి పాత్ర ఎంతటిదో, తండ్రిదీ అంతే పాత్ర!
దీనితో ఏకీభవించే వారందరూ తన కోసం ఎన్నో త్యాగాలు చేసిన తండ్రికి ధన్యవాదాలు అర్పించడం ఒక చిన్న కర్తవ్యం అని అనుకోవాలి.
మీరెక్కడున్నా మీ కోసమే ఎదురుచూస్తున్న మీ తండ్రిని ఈరోజు ఒకసారి పలకరించండి